వర్షాలకు భారీగా ఆస్తినష్టం

కోతకు గురైన పంటలను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

● మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, సెప్టెంబర్ 4: ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా ఆస్తినష్టం వాటిల్లిందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మండలంలో పలు చోట్ల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు, రోడ్లతో పాటు ఎన్మన్‌బెట్ల సమీపంలో కోతకు గురైన రోడ్డు, పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రాణనష్టానికి ఆరు లక్షలు, పంట నష్టానికి రూ.10వేలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, పాలమూరు జిల్లాలో వరద ఎఫెక్ట్ అధికంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మంలోనే ఉండి పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.6వేల కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కూడా రాష్ట్రాన్ని ఆదుకునే బాధ్యత ఉందన్నారు. యుద్ధ ప్రాతిపాదికన రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. వట్టెం రిజర్వాయర్ కూడా నిండా మునిగిందని ఎలా మునిగిందని వివరాలు తెలుసుకున్న తర్వాత స్పందిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ఆధికారులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: మాజీ ఎమ్మెల్యే బీరం

బీఆర్ఎస్ కార్యకర్త పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం

కొల్లాపూర్, సెప్టెంబర్ 4: కార్యకర్తలకు అండుబాటులో ఉండి అండగా నిలుస్తానని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సున్నపుతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సీతారాంనాయక్ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం బుధవారం సున్నపుతండాకు చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం సీతారాంనాయక్ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు.

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

కోడేరు శివారులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డీఏవో చంద్రశేఖర్

కోడేరు, సెప్టెంబర్ 4: మండలంలో కురిసిన భారీ వర్షాలకు వరి, వేరుశనగ పంటలను నష్టపోయిన రైతుల పొలాలను బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రశేఖర్ పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి వెంటనే జిల్లా కార్యాలయాలని పంపాలని విస్తరణ అధికారులకు ఆదేశించారు. రైతులు అధైర్యపడొద్దని, నష్టపరిహారం తప్పకుండా అందజేస్తామన్నారు. అనంతరం కోడేరు రైతువేదికను తనిఖీ చేసి పంటరుణాలపై సందేహాలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డులు లేని రైతుల వివరాలు ఎలా సేకరిస్తున్నారని ఏఈవోను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో మధుసూదన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు చిత్తవుతున్న యువతపై దృష్టిసారించాలి

మాట్లాడుతున్న డాక్టర్ సంధ్యారాణి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 4: మత్తు పదార్థాలకు బానిసలవుతున్న విద్యార్థులు, యువతను కాపాడి రేపటి భారతావనిని నిర్మించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్సై జనార్దన్, డాక్టర్ సంధ్యారాణి విజ్ఞప్తి చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం తెలకపల్లిలోని ఓఫంక్షన్‌హాల్‌లో మత్తుపై సెమినార్‌నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాలయాలను అడ్డాగా చేసుకొని విక్రయదారులు విద్యార్థులు, యువకుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరికి మత్తుపదార్థాలు అలవాటు చేస్తుంటే మరికొందరిని మత్తు పదార్థాల రవాణాకు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. తెలకపల్లిప్రాంతంలో గంజాయి వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, నిర్మూలించడానికి పోలీస్ శాఖ చాలా వరకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో శివ, కల్పన, స్వరూప, నితిన్, తరుణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటను అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చాలి

● చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు

అచ్చంపేట, సెప్టెంబర్ 4: అచ్చంపేట మున్సిపల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు అందరం కలిసి పనిచేద్దామని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. బుధవారం అచ్చంపేట కౌన్సిల్ సమావేశం కొనసాగింది. సమావేశంలో వార్డుల వారీగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వర్షాల వల్ల కలుగుతున్న ఇబ్బందులపై చర్చించారు. వర్షాలతో కాలనీల్లో నీరునిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకారంతో మున్సిపల్‌లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తీర్మానించారు. కౌన్సిల్ సభ్యులు వార్డుల్లో నెలకొన్న సమస్యలు ప్రస్తావించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్యాంసుందర్, వైస్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, ఏఈ రాజు, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.

NT-331758

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివాదించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

రక్తదానం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత

● కలెక్టర్ బదావత్ సంతోష్
● ఫొటోగ్రాఫర్స్ మెగారక్తదాన శిబిరం ప్రారంభం

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 4: రక్తదానం చేయడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ప్రపంచ ఫొటోగ్రాఫర్ దినోత్సవ ముగింపు సంబురాల సందర్భంగా సంఘం తరపున ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ఫొటో, వీడియో గ్రాఫర్లను కలెక్టర్ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన అధునాతన ఫొటో, వీడియో కెమెరాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్లు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ముందుండాలన్నారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేవిధంగా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫొటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నేతాజీగౌడ్, వెంకట్, కేశవులు, గోవర్ధన్, విజయ్‌గౌడ్, మల్లేశ్, రాజు, కపిలవాయి రాజు, వెంకటేశ్, నిర్మలాదేవి, శ్రీను, వీరేందర్‌గౌడ్, రెడ్‌క్రాస్ కార్యదర్శి రమేశ్‌రెడ్డి, కుమార్, డాక్టర్ రోహిత్, జిల్లాలోని ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలి

రైతులు అధికంగా ఆదాయం వచ్చే పంటలను సాగు చేసేందుకు మొగ్గు చూపాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. బుధవారం మండలంలోని గన్యాగులలో ఎద్దుల నర్సింహారెడ్డి 18 ఎకరాలలో సాగు చేస్తున్న ఆయిల్ పాం సాగును కలెక్టర్ పరిశీలించారు. ఆయిల్‌పామ్ సాగు వివరాలు, లాభాలపై అడిగి తెలుసుకున్నారు. రైతులు సాంప్రదాయ పంటలకు బదులుగా అధిక లాభాలు అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిసారించాలని సూచించారు. ఆయిల్ పాం వల్ల కలిగే లాభాల గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఆసక్తి అనుకూల పరిస్థితులు కలిగిన రైతులు సాగుచేసేలా చూడాలని ఉద్యానశాఖాధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఉద్యానశాఖాధికారి జగన్, డివిజన్ శాఖాధికారి చంద్రశేఖర్, కొల్లాపూర్ డివిజన్ అధికారి లక్ష్మణ్, నాగర్‌కర్నూల్ ఎంపీడీవో కోటేశ్వర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కల్వకోలులో వరిపంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి

మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర కార్యాలయం రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి ఖాజానజీమ్‌అలీఅప్సర్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సజీనామహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్ఞాన వికాస భారతి ఆధ్వర్యంలో ముద్రించిన బ్రోచర్‌ను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ విడుదల చేశారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

కొల్లాపూర్, సెప్టెంబర్ 4: ఏరియా దవాఖానలో వైద్యులు ఎల్లవేళాలా అందుబాటులో ఉండాలని బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కొల్లాపూర్ ఏరియా దవాఖానను సందర్శించి అన్ని విభాగాలు, రోగులకు సేవలను అందిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే రామాపురం సమీపంలోని డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి డయాలసిస్ పనితీరును పరిశీలించారు. దవాఖాన పర్యవేక్షకుడు శ్రీనివాసులతో దవాఖానలో రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమశిలలో పర్యాటకులకు కావాల్సిన సౌకర్యాలను పరిశీలించి మరుగుదొడ్ల నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు, కొల్లాపూర్ తాసీల్దార్ విష్ణువర్ధన్‌రావు తదితరులు ఉన్నారు.

దెబ్బతిన్న వరిపంటల పరిశీలన

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 4: మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను బుధవారం కలెక్టర్ సంతోష్ పరిశీలించారు. మండలంలోని కల్వకోలులో మహిళా రైతు సాకలి మణెమ్మ సాగుచేసిన వరి పంట విస్తీర్ణం, వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని జిల్లా వ్యవసాయాధికారులు, గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. వరిపంట పొలాల్లో తిరుగుతూ జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండలంలో 455 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారని తెలిపారు. నష్టపోయిన రైతుల వివరాలను తాసీల్దార్, వ్యవసాయ విస్తరణ అధికారులు సేకరించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లాలో ఇటీవల కురిసి భారీ వర్షాల వల్ల 1,280 మంది రైతులకు చెందిన 2,455 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని, పంట నష్టపరిహారానికి రాష్ట్రప్రభుత్వానికి నివేదించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఏవో చంద్రశేఖర్, ఏవో శిరీష, ఏఈవో ముజీబ్, రైతులు ఉన్నారు.

ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

● ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 4: ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఓఫంక్షన్‌హాల్‌లో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై పండుగలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. త్వరలో రాబోతున్న గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రతిష్ఠిస్తున్న గణపతి ఉత్సవ కమిటీలు పక్కాగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి మండపం వద్ద 24గంటలపాటు ఒక వ్యక్తి అక్కడే ఉండేటట్లు చూసుకోవాలని, ఎలాంటి సమాచారం ఉన్నా ఆ వ్యక్తికి తెలిసేలా నడుచుకోవాలని, ఏమైనా సమస్యలున్నా పోలీసులకు సమాచారం ఇస్తారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కనకయ్య, నాగర్‌కర్నూల్‌లోని సబ్ డివిజన్ ఎస్సైలు, హిందూ, ముస్లిం, క్రిష్టియన్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ రఘునాథ్

మండపాలకు ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి

● అదనపు ఎస్పీ సీహెచ్ రామేశ్వర్

అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 4: వినాయక మండపాలకు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అదనపు ఎస్పీ సీహెచ్ రామేశ్వర్ అన్నారు. బుధవారం అచ్చంపేటలోని బీకే ప్యాలెస్‌లో ఏర్పాటుచేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాలు వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద డీజే సౌండ్ పాటలు రాత్రి 10 గంటల వరకే ముగించాలని, ఆన్‌లైన్‌లో కమిటీ సభ్యుల పేర్లతోపాటు పూర్తి వివరాలు తెలపాలని వివరించారు. అనంతరం విద్యుత్ ఏఈ ఆంజనేయులు మాట్లాడుతూ.. విద్యుత్ తీగల కింద మండపాలు ఏర్పాటు చేయరాదని, స్తంభాలకు కొండ్లు వేయకూడదని, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన మండపాలకు విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మాధవి, తాసీల్దార్ మురళీమోహన్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రవీందర్, శంకర్, ఎస్సైలు రాములు, గురుస్వామి, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సీహెచ్ రామేశ్వర్

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 4: వినాయక చవితి ఉత్సవాలను పట్టణ ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మండపాల నిర్వాహకులకు కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శాంతిసమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ హాజరై మాట్లాడారు. వినాయక ఉత్సవాలు కల్వకుర్తిలో చాలా ప్రశాంతంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని.. ఆనవాయితీని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, మండపాల నిర్వాహకులు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు కల్వకుర్తి , వెల్దండ సీఐలు నాగార్జున, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సైలు మాధవ రెడ్డి, మహేందర్, వెంకట్‌రెడ్డి, వీరబాబు, ట్రాన్స్‌కో ఏఈ శ్రీను, మున్సిపల్ ఏఈ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ స్థలాన్ని కాపాడాలి

అచ్చంపేట, సెప్టెంబర్ 4: పట్టణంలోని వినాయకనగర్ కాలనీలో ఉన్న మున్సిపల్ పార్కు స్థలాన్ని కాలనీవాసులకు కేటాయించాలని కాలనీవాసులు శంకర్‌లింగం, శ్రీనివాసులు, రమేశ్‌రెడ్డి, తిరుపతయ్య, గోపీనాథ్ తదితరులు మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కమిషనర్, వైస్ చైర్‌పర్సన్‌కు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 282 సర్వేనెంబర్‌లోని ప్లాట్ల నెంబర్స్ 52, 53లోని స్థలంలో గతంలో పంచాయతీ మంచినీటి బావి ఉండేదని, ప్రస్తుతం బావి ఉపయోగంలో లేనందున పట్టణ ప్రగతిలో పూడ్చివేయగా ఆ స్థలం ఖాళీ ఏర్పడిందని తెలిపారు. స్థలాన్ని కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని, మున్సిపల్ పాలకవర్గం స్పందించి వినాయకచవితి, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కేటాయించాలని కోరారు. మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చపెట్టి నిర్ణయం తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ తెలిపారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ

బైరాపూర్‌లో మొక్కలు నాటుతున్న నాయకులు

వెల్దండ సెప్టెంబర్ 4: మానవాళి మనుగడకు చెట్లు ఎంతో అవసరమని ప్రతిఒక్కరం మొక్కలు నాటుదామని బీఆర్ఎస్ నాయకుడు, బైరాపూర్ మాజీ సర్పంచ్ దార్లకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బైరాపూర్‌లో హరితహారంలో భాగంగా మొక్కలు పంపిణీ చేసి, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. భవిష్యత్ తరాలకు మొక్కలు ఎంతో అవసరమన్నారు. ఇంటికో మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో అంబుడ్స్ పర్సన్ జంగయ్య, చెన్నయ్య, నర్సింహ, ముత్యాలు, యాదయ్య, కొండల్, అంజయ్య ఉన్నారు.

కేఎల్ఐ కాల్వలో నీళ్లు రాకుండా అడ్డుకట్ట

వంగూరు, సెప్టెంబర్ 4: కేఎల్ఐ కాల్వ నుంచి వంగూరు వైపు వచ్చే సబ్ కెనాల్‌కు నీరు రాకుండా జూపల్లి రైతులు రాళ్లు వేశారని వంగూరు రైతులు ఆరోపిస్తున్నారు. డీ-82 కాల్వ ద్వారా వస్తున్న కృష్ణా నీరు సబ్ కెనాల్ ద్వారా వంగూరు, వెలుమలపల్లి రైతులకు రాకుండా హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారి పక్కన కొండారెడ్డిపల్లి గేటు సమీపంలో చారకొండ మండలం జూపల్లి రైతులు రాళ్లు అడ్డుగా వేశారు. దీంతో నీరు రాకుండా ఆగిపోయాయి. అధికారులు స్పందించి వెంటనే రాళ్లను తొలగించి నీటిని విడుదల చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతామని బీఆర్ఎస్ మండల నేతలు గణేశ్‌రావు, రాజేందర్‌రెడ్డి, ఎల్లాగౌడ్ తదితరులు హెచ్చరించారు.

తెగిన కేఎల్ఐ డీ 82 కాల్వ

వెల్దండ, సెప్టెంబర్ 4: మండలంలోని గుండాల -వెల్దండ సమీపంలో కేఎల్ఐ డీ 82 కాల్వకు గండి పడడంతో సాగునీరు వృథాగా పారుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద ఎక్కువైంది. ఈ క్రమంలో వెల్దండ సమీపంలోని లచ్చపురం చెరువు వద్ద కేఎల్ఐ కాల్వకు గండి పడింది. బుధవారం తెల్లవారుజామున కాల్వ తెగి ఉంటుందని స్థానిక రైతులు అంటున్నారు. అయితే కాల్వ తెగిపోవడంతో సాగునీరు వృథాగా పోతున్నాయి. ఇదిలా ఉండగా ఇప్పటికి అధికారులు కాల్వకు మరమ్మతులు చేసేందుకు చొరవ చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వృథాగా పారుతున్న నీరు

కేఎల్ఐ కాల్వలో నీరు రాకుండా వేసిన రాళ్లు

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 4: జాతీయ ఫుట్‌బాల్ సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో తెలంగాణ జట్టు విద్యార్థులు చక్కటి ప్రతిభ చాటాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్ ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి కోరారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి ఎంపికైన క్రీడాకారులు 15రోజులుగా కోచ్‌లు నాగరాజు, వెంకట్రాములు ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. వీరు ఈనెల 9న మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు అభినందనలు తెలిపి వారిని టోర్నీకి పంపించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విజయభాస్కర్, చందు, సదానందం గౌడ్, మెహన్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు వెళ్తున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ

లింగాల, సెప్టెంబర్ 4: స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం డీటీడీవో ఫిరంగి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీటీడీవో మాట్లాడుతూ.. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాల ఆవరణను ఎప్పటికప్పుడు చెత్తాచేదారం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు అర్థమయ్యే రితీలో పాఠాలు బోధించాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే రోగాలు ధరి చేరవన్నారు. అంతకు ముందు స్టాక్ రిజిస్టర్, విద్యార్థులకు హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయనవెంట వార్డెన్ మంగమ్మ ఉన్నారు.

వెదురు పరికరాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

లింగాల, సెప్టెంబర్ 4: వెదురు బొంగుతో తయారు చేసిన పరికరాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని మాతృభూమి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రమాకాంత్ అన్నారు. ఎరుకల కుల సంఘాల మహిళలకు వెదురు బొంగుతో తయారు చేసే పరికరాలపై పదిరోజులుగా శిక్షణా తరగతులు నిర్వహించగా బుధవారం ముగింపు సమావేశం నిర్వహించి శిక్షణ పొందిన 30మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాతృభూమి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మాట్లాడుతూ.. వెదురు చెట్టుకాదని.. గడ్డిజాతికి చెందిన మొక్క అని పేర్కొన్నారు. బొంగుతో రకరకాలుగా తయారు చేసిన పరికరాలకు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంటుందన్నారు. వెదురుతో టీ కప్పులు, మొబైల్ స్టాండ్, ఎద్దుల బండి, పూల బొకేలు తయారు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఈ పరికరాలతో వాతావరణ పరిరక్షణను కాపాడడమే కాకుండా కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒకే ఒక శిక్షణ కేంద్రం లింగాలలో ఏర్పాటు కావడం గమనార్హమన్నారు. కార్యక్రమంలో సంస్థ డిజైనర్ మోహన్‌ఖన్నా, ఎరుకల సంఘం నాయకులు ఆదిశేషయ్య, హుస్సేన్, మహిళలు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రమాకాంత్

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్వకుర్తి, సెప్టెంబర్ 4: మిడ్జిల్ మాజీ జెడ్పీటీసీ భీమయ్యగౌడ్ కుటుంబాన్ని బుధవారం కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి ప్రధాన అనుచరుడుగా ఉన్న భీమయ్యగౌడ్ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం భీమయ్యగౌడ్ కుటుంబాన్ని ఓదార్చారు. భీమయ్యగౌడ్ పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్‌వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

శాంతియుతంగా నిర్వహించాలి

లింగాల, సెప్టెంబర్ 4: వినాయక చవితి ఉత్సవాలను శాంతియూత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై జగన్‌మోహన్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో వినాయక చవితి మండపాల నిర్వాహకులతో శాంతిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు ముందుగా మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని పోలీస్ శాఖ, పంచాయతీ, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫారాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని కోరారు.

విజ్ఞాన వేళాలో విద్యార్థుల ప్రతిభ

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 4: కల్వకుర్తి పట